మంత్రి పొన్నంను కలిసిన గౌడసంఘం నాయకులు

మంత్రి పొన్నంను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గౌడసంఘం నాయకులు

కొమురవెల్లి, మార్చి 26: రోడ్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మంగళవారం కొమురవెల్లి మండల గౌడసంఘం నాయకులు హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి కొమురవెల్లి మల్లికార్జునస్వామి ప్రసాదం, స్వామి వారి శేషవస్త్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రసూలాబాద్ మాజీ సర్పంచ్ పచ్చిమండ్ల స్వామిగౌడ్, కొమురవెల్లి మాజీ ఎంపీటీసీ ముత్యం లక్ష్మయ్యగౌడ్, గౌడసంఘం నాయకులు ముత్యం నర్సింహులుగౌడ్, బుడిగె గురువయ్యగౌడ్, దొడ్ల భిక్షపతిగౌడ్, దొమ్మాట సత్తయ్యగౌడ్, మారగోని భిక్షపతిగౌడ్, ముత్యం ఉప్పలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఆహ్వానం

మంత్రి సీతక్కను ఆహ్వానిస్తున్న కమలాయపల్లి గ్రామస్తులు

చేర్యాల, మార్చి 26 : చేర్యాల మండలంలోని కమలాయపల్లిలో ఏర్పాటు చేసిన మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణకు రావాలని బయో డీజిల్ డెవలప్‌మెంట్ అథ్రరైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు లింగంపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు గందమాల యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28న మంత్రి సీతక్క కమలాయపల్లిలో ఏర్పాటు చేసిన మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణకు రానున్నారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రోన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలి



డ్రోన్ పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

మర్కుక్, మార్చి 26: రైతులు డ్రోన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ కోరారు. మండలంలోని రైతు వేదికలో మంగళవారం 'వ్యవసాయ రంగంలో డ్రోన్ పాత్ర.. దాని ఉపయోగాలు' అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన తర్వాతనే డ్రోన్ ద్వారాపంటలకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డ్రోన్ వాడకం వల్ల కార్మికుల వినియోగం తగ్గి ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఇఫ్కో సంస్థ జిల్లాలోని ఆరు రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు దాదాపు రూ.16లక్షల విలువగల డ్రోన్‌తో పాటు వాహనాన్ని ఉచితంగా అందజేసినందుకు జిల్లా మేనేజర్ చంద్రబాబునాయడు, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ అమరేశ్, మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి, ఏఈవోలు, కొండపోచమ్మ ఎఫ్‌పీసీ చైర్మన్ కొండల్‌రెడ్డి, గ్రామరైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకుడికి అభినందనల వెల్లువ

అధ్యాపకుడు వెంకటేశ్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

దుబ్బాక టౌన్, మార్చి 26: అమెరికా దేశ సాహితీ సంచికలో దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడి వ్యాసం ప్రచురితమైందని కళాశాల ప్రిన్సిపాల్ డా. భవాని తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ... కళాశాలలో దుబ్బాక పట్టణానికి చెందిన డాక్టర్ ఇట్టబోయిన వెంకటేశ్ తెలుగు అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారన్నారు. అంతర్జాతీయంగా పేరుగాంచిన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం సంయుక్తంగా 13వ అమెరికా తెలుగు సదస్సులో భాగంగా వెలువరించిన సభావిశేష సంచికలో తెలుగు భాషలో 'తెలంగాణ ప్రాదేశిక పదవిన్యాసం' అనే శీర్షిక ప్రచురితమైందని తెలిపారు. తెలంగాణ భాష గొప్పతనాన్ని ఖండాంతరాలకు తెలియజేసిన అధ్యాపకుడు వెంకటేశ్‌కు అరుదైన గౌరవం దక్కిందన్నారు. వెంకటేశ్‌ను ప్రిన్సిపాల్ డా.భవాని, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్‌తో పాటు అధ్యాపకులు సన్మానించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

మాట్లాడుతున్న వడ్డెర సంఘం నేతలు

సిద్దిపేట టౌన్,మార్చి 26 : ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం న్యాయం కాదని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్,పట్టణ అధ్యక్షుడు తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో 15 ఏండ్లుగా 32 ఇండ్లవారు నివసిస్తున్నారన్నారు. కొన్ని రోజులుగా కొందరు వ్యక్తులు అక్రమంగా వచ్చి తాము నడుస్తున్న రోడ్డు మాది అని కబ్జా చేసి నిర్మాణం చేస్తుంటే అడ్డుకుని ప్రశ్నించామన్నారు.దీంతో వారందరూ ఇండ్లపైకి వచ్చి దాడి చేశారన్నారు. మహిళలు, పిల్లలు అని చూడకుండా దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంమై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.సమావేశంలో సంఘం నాయకులు మల్లేశం, రవి, స్వామి, రాజు, నర్సింహులు, శ్రీనివాస్, చందు పాల్గొన్నారు.

జర్నలిస్టు సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్

నూతనంగా ఎన్నికైన కొండపాక జర్నలిస్టు సంఘం కార్యవర్గం

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 26: కొండపాక మండలం జర్నలిస్టు సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం కొండపాక మండలంలోని దుద్దెడ రేణుకాఎల్లమ్మ ఆలయం ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలుముల వెంకటేశ్ (నమస్తే తెలంగాణ), ఉపాధ్యక్షుడిగా వడ్లకొండ శ్రీనివాస్ (ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శిగా దేవికిరణ్ (వార్త), కోశాధికారిగా కృష్ణారెడ్డి (తెలుగుప్రభ), సహాయ కార్యదర్శిగా సాగర్ (ఎస్ఎస్ఎస్), సలహాదారుడిగా శ్రీహరి (ఈనాడు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన చిలుముల వెంకటేశ్ మాట్లాడుతూ కొండపాక, కుకునూరుపల్లి మండలాల జర్నలిస్టుల సమస్యల సాధనకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కొండపాక జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలి

హుస్నాబాద్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొండాపూర్ గ్రామస్తులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 26: ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్‌తో పాటు పరిసర గ్రామాలు, తండాలకు గతంలో వచ్చే హుస్నాబాద్ డిపో బస్సుసేవలను తిరిగి పునరుద్ధరించాలని మంగళవారం పలువురు గ్రామస్తులు హుస్నాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో ఉదయం, సాయంత్రం హుస్నాబాద్ నుంచి కొండాపూర్ వరకు ఆర్టీసీ బస్సు నడిపేవారని, ఆరునెలలుగా రామవరం వరకు మాత్రమే బస్సు సేవలను పరిమితం చేయడంతో కొండాపూర్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి బస్సు సేవలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధరావత్ దీప్లానాయక్, కొయ్యడ భీమయ్య, ధరావత్ అనిత, చిలుక చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గతేడాది కాళేశ్వరం జలాలతో దర్శనమిస్తున్న నంగునూరు మండలం ఘనపూర్ చెక్‌డ్యామ్



ప్రస్తుతం నీళ్లు లేక దర్శనమిస్తున్న నంగునూరు మండలం ఘనపూర్ చెక్‌డ్యామ్

నాడు జలకళ.. నేడు వెలవెల

నంగునూరు, మార్చి 26: మండలంలోని పెద్దవాగు గత ఏడాది (మార్చి నెలలో) ఇదే సమయంలో కాళేశ్వరం జలాలతో పరవళ్లు తొక్కింది... నేడు నీళ్లు లేక ఎండిపోయింది. కేసీఆర్ ప్రభుత్వం ఉంటే మళ్లీ మా వాగు నిండుకుండలా ఉండేది అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నంగునూరు మండలంలోని పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లను గోదావరి జలాలతో గత ఏడాది మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నింపారు. ఇవాళ గోదావరి నీళ్లు రాక వాగు ఎండిపోయింది. రంగనాయకసాగర్ రిజర్వాయర్ కుడికాల్వ ద్వారా ఎల్‌డీ - 10 నుంచి నంగునూరు మండలంలోని నాగరాజుపల్లి ఊట చెరువు నుంచి పెద్దోల్ల బావి వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ మీదుగా ఘనపూర్ చెక్‌డ్యామ్‌కు నీళ్లు వస్తాయి. ఇవాళ ఆ పరిస్థితి కనిపించడం లేదు. నీళ్లు వస్తాయని ఆశపడిన రైతులకు నిరాశే ఎదురైంది. వాగు పరీవాహక ప్రాంతంలో చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం వెంటనే సాగునీటిని విడుదల చేసి పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నింపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నీళ్లు లేక దర్శనమిస్తున్న పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు

మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 26: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనుచౌదరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన నేతృత్వంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 1009 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర అధికారులను మొత్తం 4,940 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో 1,235 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,235 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2,470 మంది ఇతర పోలింగ్ అధికారులు ఉన్నట్లు తెలిపారు. ప్రతి టీమ్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు ఉంటారని తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా నియమించిన వారికి ఆయా శాఖల ద్వారా సమాచారం అందించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రెహమాన్, ఈడీఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ నిర్ధారణ ప్రాజెక్టుకు భూమి పూజ

భూమి పూజ చేస్తున్న నాబార్డు డీజీఎం సిసిల్ తిమోత్

కొమురవెల్లి, మార్చి 26: మండలంలోని గురువన్నపేటలో ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వాతావరణ నిర్ధారణ పథకం ప్రాజెక్టు (సీపీపీ) నిర్మాణానికి నాబార్డు డీజీఎం సిసిల్ తిమోత్, ఏవో నరేశ్, ధాన్ ఫౌండేషన్ ఎఫ్‌పీవో ప్రతినిధులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాబార్డు డీజీఎం సిసిల్ తిమోత్ మాట్లాడుతూ సీపీపీ ప్రాజెక్టులో భాగంగా ఫాం పాండ్ నిర్మాణాలు, రాళ్ల కట్టడాలు, కూరగాయల పెంపకం, డ్రిప్పు, స్ప్రింకర్లు, బోరు రీచార్జి తదితర పనులు ఉన్నాయని, నిర్ణీత సమయంలో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ధాన్ ఫౌండేషన్ రీజినల్ కో ఆర్డినేటర్ మల్లికార్జున్, సీఈవో ఝాన్సీ, టెక్నికల్ అసిస్టెంట్ నరేశ్, సీపీపీ చైర్మన్ బుడిగె ఐలేనిగౌడ్, సీపీపీ కార్యదర్శి మకిలి నవీన్, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు, ఎఫ్‌పీవో కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మార్చి 26: మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు పాల సాయిరామ్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వందరోజుల కాంగ్రెస్ పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి ఉన్న సమయంలో ఎన్నో సేవలందించారన్నారు. విద్యావంతుడు, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని మెదక్ ఎంపీ స్థానానికి అభ్యర్థిగా ప్రకటించినందుకు గులాబీ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 29న మధ్యాహ్నం 12 గంటలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆధ్వర్యంలో పొన్నాల వద్ద గల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్‌లాల్, జాపశ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి, వజీర్, మోయాజ్, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మధు, మెరుగు మహేశ్, రెబల్ రమేశ్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

గజ్వేల్, మార్చి 26: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు బండారు మహేశ్, మండల అధ్యక్షుడు అశోక్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు అధికారులు రైతుల ఇంటి చుట్టూ తిరుగుతూ రుణాలు త్వరగా కట్టాలని వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. సమావేశంలో మధుసూదన్, జనార్దన్, రాజు, నర్సింహా, నరేశ్, వెంకటేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గజ్వేల్, మార్చి 26: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరుతూ మంగళవారం గజ్వేల్‌లో కార్మికశాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రెడ్డికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ 1948 వేతనచట్టం ఆధారంగా కనీస వేతనాలు నిర్ణయిస్తూ జనవరిలో ప్రభుత్వం జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ కార్మికుల కడుపులు కొట్టే విధంగా ఉందన్నారు. కనీస వేతనం రూ.26వేలు అమలయ్యే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. పెరిగిన ధర ఆధారంగా నెలకు రూ.28 వేల ఆదాయం ఉంటేనే కార్మికులు జీవనం కొనసాగించడం సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సురేశ్, సద్దాం, నరేశ్ పాల్గొన్నారు.

విద్వేషకర పోస్టులు పెడితే కేసులు

- సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, మార్చి 26: సోషల్ మీడియాలో విద్వేషకర తప్పుడు పోస్టులు, మార్ఫింగ్ చేసి ఫొటోలు, రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. ప్రజలు, యువకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టవద్దని.. అలా చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, ప్రజలు ఎవరూ నమ్మవద్దని సూచించారు. ఎవరైనా తప్పుడు, విద్వేషకర పోస్టులు పెట్టినా, షేర్ చేసినా వారి సమాచారాన్ని కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ : 871266 7100కు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా యువత వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నడుచుకోవాలని, సోషల్ మీడియాలో అనవసరమైన పోస్టులు పెట్టి ఇబ్బంది పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సీపీ సూచించారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

దొమ్మాటలో కేంద్ర బలగాలతో ప్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

రాయపోల్, మార్చి 26: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట, సూరంపల్లి గ్రామాల్లో కేంద్ర బలగాలతో ప్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దన్నారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని,లేదా పోలీస్ కంట్రోల్ రూం సెల్: 8712667100నంబర్‌కు లేదా డయల్ 100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో తొగుట సీఐ షేక్ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్‌ప్రదీప్, కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న ఉద్యోగార్థులు

లైబ్రరీ తెరిచి ఉంచాలి

సిద్దిపేట అర్బన్, మార్చి 26: ఉద్యోగ నియామకాల పోటీ పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నందున సెలవు రోజుల్లోనూ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయాన్ని తెరిచి ఉంచాలని ఉద్యోగార్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరికి ఉద్యోగార్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయంలో కొన్ని రోజులుగా గ్రూప్స్, డీఎస్సీ వంటి ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పరీక్షల తేదీలు ప్రకటించినందున సమయం తక్కువగా ఉండటం వల్ల సెలవు రోజుల్లో కూడా లైబ్రరీ తెరిచి ఉంచే విధంగా లైబ్రేరియన్‌ను ఆదేశించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి తమ సమస్య పరిష్కరిస్తామని చెప్పినట్లు ఉద్యోగార్థులు తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

అంకురార్పణ పూజలు చేస్తున్న వేద పండితులు

వర్గల్, మార్చి 26: వర్గల్ విద్యాధరి సరస్వతీ అమ్మవారి ఆలయ పరివారంలో మరో ఉపదేవాలయం రూపుదిద్దుకుంది. సరస్వతీ మాతతో పాటు పలు దేవాలయాలకు నెలవైన శంభునిగికొండపై శ్రీపరివారసమేత చంద్ర మౌళీశ్వరాలయం అత్యంతవైభవంగా వెలిసి భక్తులకు కల్పతరువుగా మారింది. ఆలయ ప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం ఉదయం బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో గణపతిపూజ, చండీహోమం, పంచగవ్యప్రాశనం, అవాహిత దేవతాహ్వానం, జలాదివాసం తదితర క్రతువులు జరిగాయి. కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

మత్తడివాగును పరిశీలించిన అధికారులు

మత్తడి వాగును పరిశీలిస్తున్న డీటీపీసీ అధికారి వందనం

కొమురవెల్లి, మార్చి 26: మండలంలోని రసూలాబాద్‌లో డీపీటీసీ వెంచర్ పక్కన గుగ్గిలకుంట చెరువు మత్తడివాగును మంగళవారం డీటీపీసీ అధికారి వందనం పరిశీలించారు. దుర్గమ్మ గుడి వద్ద లేఅవుట్‌కు డీటీపీసీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డీటీపీసీ అధికారి మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నివేదికలో కాల్వ లేకపోవడం వల్ల డీటీపీసీ అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట రసూలాబాద్ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఉన్నారు.

మల్లన్న ఆదాయం రూ.43,76,829

చేర్యాల, మార్చి 26 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల 10వ ఆదివారం రూ.43,76,829 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. శని, ఆది, సోమవారాల్లో అర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం తదితర వాటి ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. శనివారం రూ.4,77,648 ఆదివారం రూ. 34,98,777, సోమవారం రూ. 400,404 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది ఉన్నారు.

బాల కథకులకు అభినందన

నారాయణరావుపేట, మార్చి 26: సుగుణ సాహితీ సమితి సిద్దిపేట ప్రకటించిన జిల్లా స్థాయి ఉగాది బాలల కథ పోటీ–2024 ఫలితాల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు బహుమతులు సాధించినట్లు ఆ సంస్థ కన్వీనర్ బైతి దుర్గయ్య తెలిపారు. జక్కాపూర్ ఉన్నత పాఠశాల నుంచి పి.వైష్ణవికి తృతీయ బహుమతి, మిద్దే గణేశ్‌కు ప్రత్యేక బహుమతి, గుర్రాలగొంది ఉన్నత పాఠశాల నుంచి బి.రుచిత్‌కు ప్రత్యేక బహుమతి, లక్ష్మీదేవిపల్లి ఉన్నత పాఠశాల నుంచి పి.సంజన, ఎం.హరికకు ప్రత్యేక బహుమతులు లభించినట్లు తెలిపారు. బహుమతి పొందిన బాలకథకులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

సేంద్రియ ఎరువు విక్రయం

సిద్దిపేట, మార్చి 26: సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని మందపల్లి రీసోర్స్‌పార్కులో తయారు చేసిన సేంద్రియ ఎరువును రైతులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి తెలిపారు. మంగళవారం సిద్దిపేట మున్సిపల్ పరిధిలో 4060 క్వింటాళ్ల సేంద్రియ ఎరువును సయ్యద్ మాక్సుద్ సలం అనే రైతుకు విక్రయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్విరామెంటల్ ఇంజినీరు దిలీప్, రీసెర్చ్ పార్కు ఇన్‌చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

చేర్యాల, మార్చి 26: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చేర్యాల డివిజన్ నూతన కమిటీని మంగళవారం చేర్యాల పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులుగా సుద్దాల భాస్కర్, అముదాల రంజిత్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా హారిక, తాడూరి భరత్, సహాయ కార్యదర్శులుగా పురమ రాకేశ్‌రెడ్డి, నాగపురి కిరణ్‌తో పాటు 13 మందితో డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చొప్పరి రవి, వివిజన్ నాయకులు మహేశ్, శివ, అనిల్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

మిరుదొడి (అక్బర్‌పేట భూంపల్లి) మార్చి 26: చేపల వేటకు వెళ్లి కరెంట్ షాక్‌తో మృతిచెందిన సంఘటన అ